రాయలచెరువు గ్రామ సత్రం భూమి ఆక్రమణకు ప్రయత్నం

యాడికి, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు గ్రామంలో పురాతన కాలం నుండి గ్రామ ప్రజల సామూహిక వినియోగంలో ఉన్న గ్రామ సత్రం భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా స్వంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సత్రం చారిత్రక ప్రాధాన్యం కలిగినదిగా, గ్రామ ప్రజల సామూహిక కార్యక్రమాలు, ప్రజా ఉపయోగాలకు ఉపయోగపడుతూ వచ్చినదని వారు తెలిపారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని తమ వ్యక్తిగత ఆస్తిగా చూపిస్తూ ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో భూమి రికార్డులను పరిశీలించి సర్వే నిర్వహించి సత్ర స్థల ఆక్రమణను తక్షణమే నిలిపివేసి, ఆ భూమిని గ్రామ ప్రజల సామూహిక వినియోగానికి రక్షణ కల్పించాలని గ్రామస్తులు యాడికి మండల తహసిల్దార్ ప్రతాప్ రెడ్డికి మరియు యాడికి మండల ఎంపీడీవో వీర రాజుకు వినతిపత్రం అందజేశారు

అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలోగల అగాపే వృద్ధాశ్రమంలో ఎ.పి. స్కిల్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మిరెడ్డి పుట్టినరోజు శుభ సందర్భంగా ఆయన బృంద సభ్యులు వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక విందు ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. లక్ష్మిరెడ్డి సార్ నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నామని, ఉద్యోగ పరమైన అంశాల్లో ఎంతో సహాయం, మార్గనిర్దేశం అందించినందుకు ఎప్పటికీ కృతజ్ఞులమని ఆయన బృంద సభ్యులు తెలిపారు. ఆ కృతజ్ఞతాభావంతోనే ఆయన పుట్టినరోజును ఆశ్రమంలో వృద్ధుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ మాట్లాడుతూ తమ ఆశ్రమంలో ఈ విధంగా సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. లక్ష్మిరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అన్నదానం కార్యక్రమానికి సహకరించిన బృంద సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు

పుష్పక విమానంపై విహరించిన శ్రీ చెన్నకేశవ స్వామి

యాడికి, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు పుష్పక విమాన వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పాలతో సుందరంగా అలంకరించిన విమానంపై స్వామివారు విహరించగా, వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలు భక్తుల జయజ-యధ్వానాలతో మార్మోగాయి. స్వామివారి దర్శనంతో భక్తులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, దేవస్థానం కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎఎస్పి రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు యాడికి సిఐ శ్రీనివాసులు తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు

ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా

అనంత, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వైసీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి అనంతపురంలోని తన స్వగృహంలో బుధవారం రోజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా హాజరై మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్ రెడ్డికి శాలువాను కప్పి పూల గుచ్చాన్ని అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశ-ారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

జూనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ లో విజేతగా విజన్ విద్యాసంస్థల జట్టు

యాడికి, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా యాడికిలో నిర్వహించిన జూనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ క్రీడాభిమానులను ఆకట్టుకుంది. చిన్నారుల ఉత్సాహభరిత ఆటతీరుతో టోర్నమెంట్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఈ టోర్నమెంట్‌లో యాడికికి చెందిన విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ జట్టు, రాయలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుపై ఘన విజయం సాధించి విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండు జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ అత్యంత ఆసక్తికరంగా సాగి ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. విజేత జట్టుకు స్టార్ పారడైజ్ హైస్కూల్ యాజమాన్యం తరఫున ట్రోఫీతో పాటు నగదు బహుమతులు, మెడల్స్ అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన విజన్ స్కూల్ విద్యార్థి శ్రీరంగను బెస్ట్ రైడర్‌గా, గణేష్‌ను బెస్ట్ డిఫెండర్‌గా ఎంపిక చేసి ప్రత్యేక అవార్డులు ప్రదానం చేశారు. ఈ పోటీలను వీక్షించేందుకు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారులను ఉత్సాహపరిచారు. చిన్న వయసులోనే చూపిన నైపుణ్యం, ధైర్యం, జట్టు స్ఫూర్తి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయగా, భవిష్యత్తులో వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులుగా ఎదుగుతారని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విజన్ విద్యాసంస్థల యా-జమాన్యం విజేతల బృందాన్ని అభినందిస్తూ, విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామిని దర్శించుకున్న తాడిపత్రి ఎఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

యాడికి,ఫిబ్రవరి 25 (అనంత ప్రభ) యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తాడిపత్రి ఎఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను భక్తులు శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు. భక్తుల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు

ఉత్సాహభరితంగా రాష్ట్ర స్థాయి సీనియర్స్ కబడ్డీ టోర్నమెంట్

యాడికి, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా యాడికి మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ సీనియర్స్ కబడ్డీ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా, క్రీడాభిమానుల మధ్య ఘనంగా ముగిసింది. రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు పోటీలో పాల్గొని క్రీడా ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో బెంగళూరు జట్టు మొదటి బహుమతి గెలుచుకుని విజేతగా నిలిచింది. వారికి వెలిగండ్ల ఆదినారాయణ, దాసరి రామచంద్ర, సుబహాన్, బద్దెల రాముడు, లక్ష్మణ్ నాయక్ కలసి రూ.50,000 నగదు బహుమతి అందజేశారు. ప్యాపిలి జట్టు రెండో బహుమతి సాధించగా తిరంపురం నీలకంఠ, గుండా నారాయణస్వామి, గన్నె రమేష్, వెలిగండ్ల ఉపేంద్ర కలిసి రూ.40,000 అందజేశారు. మూడో బహుమతి తమిళనాడు జట్టు గెలుచుకోగా లక్ష్మీ ప్రసన్న జ్యువెలర్స్ ప్రోప్రైటర్ నీలూరు చంద్రశేఖర్ రూ.30,000 అందజేశారు. నాలుగో బహుమతి యాడికి జట్టు గెలుచుకోగా గంగవరం రవితేజ, ముత్తూట్ మనీ గంగాధర్, భాస్కర్ రెడ్డి కలిసి రూ.20,000 బహుమతి అందజేశారు. పోటీల నిర్వహణకు సహకరించిన దాతలు, నిర్వాహకులను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అంపైర్లు, క్రీడాకారుల కోసం మ్యాట్స్ అందించిన జనసేన మండల కన్వీనర్ సునీల్, వె-ంమెంటోలు అందజేసిన ప్యారడైజ్ స్కూల్ యా-జమాన్యం, భోజన వసతులు కల్పించిన లియో క్లబ్ సభ్యులు విశ్వనాథ్, రఘు, టీషర్ట్స్ అందించిన ధాత మణి సహా ఇతర దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ గ్రామీణ య-ువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు, కబడ్డీపై ఆసక్తిని పెంపొందించేందుకు కీలకంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు

దశాబ్దాల ,కల నెరవేరుస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ

ఆత్మకూరు, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరులో దశాబ్దాల కాలం నుంచి ఇండ్ల ముంగిట కాలనీలో రహదారులు సరిగా లేక చాలా ఇబ్బంది పడేవారు ఎన్నికల హామీ-ల్లో భాగంగా మాజీ మంత్రివర్యులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఇచ్చిన హామీ మేరకు దశాబ్దాల కాలం నుంచి వేయని సీసీ రోడ్లను పరిటాల సునీతమ్మ ప్రత్యేక చొరవతో ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లు తారు రోడ్లు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం వచ్చినప్పుడు నుంచి 13 కోట్లతో ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లు తారు రోడ్లు వేయించారని మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతి శశాంక్ బాబు, భారీ పరిశ్రమల రాష్ట్ర డైరెక్టర్ వెంకట్ నారాయణ, ఆత్మకూరు ఎంపీడీవో లక్ష్మి నరసింహులు తెలిపారు, బుధవారం రోజున ఆత్మకూరులో సిసి రోడ్లు పనులను అధికారులతో పాటు నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటనారాయణ, ఆత్మకూరు మండలం నాయకులు పలమా సూర్యనారాయణ, అకులన్న, ఆదెప్ప,రాము, వెంకటేశు,దాసు, బొమ్మయ్య ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఉరవకొండ, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

స్థానిక ఉరవకొండలో వేంచేసియున్న శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా శాస్త్రోక్తంగా సాగుతున్న ఈ వేడుకలు రేపటితో (గురువారం) ముగియనున్నాయి.

నేటి విశేషాలు (రెండవ రోజు):

నేడు బుధవారం ఉదయం భక్తుల సమక్షంలో శ్రీ విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ మరియు గాయత్రీ దేవి సహస్రనామ పారాయణములు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహా స్నపనము, లక్ష్మీ వేంకటేశ్వర హోమము మరియు పవమాన హోమములను వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈరోజు సాయంత్రం క్షీర తర్పణము, నవగ్రహ వాస్తు హోమములు మరియు స్వామివారికి నిద్ర సేవ (శయ్యాధివాసము) నిర్వహించనున్నారు.

రేపే ప్రధాన ఘట్టం – విగ్రహ ప్రతిష్ఠ:

ఈ ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఘట్టం రేపు గురువారం తెల్లవారుజామున జరగనుంది.

సమయం: తెల్లవారుజామ మకర లగ్న పుష్కరాంశ మూర్తమందు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మరియు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

అనంతరం కళ్యాణోత్సవం, బలిహరణ, పూర్ణాహుతి మరియు మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయి.

అన్నదాన వితరణ:

ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు ఓ.కే. పద్మనాభ శాస్త్రి ,కరణం సాయికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పుణ్యకార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ వారు,ఏయిర్ టెల్ ప్రతాప్ కోరుతున్నారు.

పయ్యావుల శ్రీనివాసులు ను మర్యాదపూర్వకంగా కలిసిన సొసైటీ చైర్మన్



కూడేరు, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రానికి చెందిన సొసైటీ అధ్యక్షులు (ప్రెసిడెంట్) జయప్రకాష్ గౌడ్ 22-2-20226 వ తేదీ ఆదివారం రోజున సొసైటీ చైర్మన్ గా ఎన్నికైనందున నామినేటెడ్ పదవిని కేటాయించడంతో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ ను మరియు తెదేపా సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల గుచ్చాన్ని అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. టిడిపి నాయకులు సర్పంచ్ లలితమ్మ, బాట వెంకటేష్, నారాయణస్వామి, గ్రామ అధ్యక్షులు శ్రీధర్ నాయుడు, బొమ్మయ్య, గొల్ల వెంకటేష్, ఎద్దుల సుధాకర్, అంకె భీమా, రోగన్నాల నాగరాజు, అక్కులప్ప, కుక్క పల్లి శంకర, చిన్న ఈశ్వరయ్య, డీలర్ శివ,గండి రామంజి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ.

శింగనమల, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

మంగళగిరిలోని ఏపిఐ ఐ సి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి మరియు అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీ టీజీ భరత్ అధ్యక్షతన అనంతపురం జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ ,అనంతపురం కలెక్టర్ ఆనంద్ ,జిల్లా ఎస్పీ జగదీష్,సహచర పార్లమెంట్ శాసనసభ్యులు,ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ.

ఈ సమావేశంలో రానున్న రోజుల్లో అనంతపురం జిల్లా మరియు శింగనమల నియోజకవర్గ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

గొటుకూరు లో ఏపీ ఎఫ్ ఆర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ అధికారులు

కూడేరు, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

గొట్కూరు, బ్రాహ్మణపల్లి గ్రామాలను ఏపీ ఎఫ్ ఆర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొరకు సందర్శించి రైతులకు విశిష్ట ఐడి కోసం తక్షణమే మీ రైతు సేవ కేంద్రం సిబ్బంది దగ్గర రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలియజేయడమైనది. స్వయాన ఒక రైతు రిజిస్ట్రేషన్ ఐడి మండల వ్యవసాయ అధికారి అయిన నేను గొట్టుకూరు గ్రామ సిబ్బంది మె-ంబైల్ లో రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. మండలంలో ఇంతవరకు మొత్తంగా 12, 602 మంది రైతులకు గాను 10,000 మంది రైతులకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మిగిలిన రైతుల త్వరగా సంబంధిత రైతు సేవ సిబ్బంది దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరడమైనది

జి.ఎల్. ఎస్.ఆర్ వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని పై కలెక్టర్ వినిత పత్రం అందజేత

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 25 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం టిడిపి ఎస్సీ సెల్ మండల నాయకుడు వరికూటి కుళ్లాయప్ప అధ్యక్షత గాంధీనగర్ కాలనీ మహిళలతో కలిసి కాలనీలో నీటి సమస్యపై కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. బుక్కరాయసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ లో సుమారు 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కాలనీవాసులు ఎక్కువ శాతం దిన కూలీపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తూ ఉన్నారు. అయితే ఈ కాలనీ నందు దాదాపు 30 సంవత్సరాలుగా ప్రజలు నివాసం ఉంటున్నారు. పంచాయతీ నందు నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఈ కాలనీకి పంచాయతీ అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ గ్రామపంచాయతీ నిధులతో త్వరితగతిన బోరు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు జిల్లా కలెక్టర్ వినతిపత్రం అందించారు. అనంతరం ఎంపీడీవో కలిసి కాలనీ సమస్యపై దృష్టి సాధించాలని వెంటనే బోరు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను కోరారు.